క్లుప్తంగా

మల్లేశ్వర స్వామి సన్నిధిలో సహస్ర లింగార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో గురువారం సహస్ర లింగార్చన జరిగింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు సహస్ర లింగార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ జరిగింది. ప్రదోష కాలంలో మల్లేశ్వర స్వామి వారికి పంచ హారతుల సేవ, మహా నివేదన సమర్పించారు. అనంతరం ఆకాశ దీపం వెలిగించగా, ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ జరిగింది. ఆలయ అధికారులు, ఉభయదాతలు, భక్తులు కుటుంబ సమేతంగా దీపాలంకరణ సేవలో పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో దక్షిణామూర్తికి గురువారం పంచామృత అభిషేకాలు, అర్చనలు జరిగాయి. స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు ప్రసాదాలను వితరణ చేశారు.

బ్యాడ్మింటన్ టోర్నీలో పీబీ సిద్ధార్థకు రన్నర్ ట్రోఫీ



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా విశ్వవిద్యాలయం అంతర కళాశాలల మహిళల బ్యాడ్మింటన్ టోర్నీలో తమ కళాశాల విద్యార్థినులు రన్నర్ ట్రోఫీని కైవసం చేసుకున్నారని పీబీ సిద్ధార్థ కాలేజీ క్రీడా విభాగాధిపతి డాక్టర్ టి.వి.బి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ నెల 20వ తేదీన శ్రీ దుర్గామల్లేశ్వర మహిళా కళాశాలలో జరిగిన పోటీల్లో వర్సిటీ పరిధిలోని కళాశాలలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో రన్నర్ ట్రోఫీని సాధించిన పీబీ సిద్ధార్థ జట్టును ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్ గురువారం తన చాంబర్‌లో అభినందించారు.

స్కందమాతా అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): పాత శివాలయంలో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు గురువారం స్కందమాత అలంకారంలో దర్శనమిచ్చారు. నగరంలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో కార్తిక మాసం సందర్భంగా జరుగుతున్న నక్షదీక్షా మహోత్సవంలో భాగంగా ఆలయంలో పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ అమ్మవారికి స్కందమాత అలంకారం చేశారు. అనంతరం త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామార్చన, మల్లేశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచ హారతులు, చతుర్వేద స్వస్తి తదితర వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మతిస్థిమితం లేని యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ విమలా బేకరీ ప్రాంతానికి చెందిన గోనుగుంట్ల రోజమ్మ కుమార్తె స్వరూప(22) ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడం లేదు. స్వరూపకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఆందోళన చెందిన తల్లి రోజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు యువతి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

బాబోయ్ వీఎంసీనా !

గతంలో వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి డెప్యుటేషన్‌పై నగర పాలక సంస్థకు వచ్చేందుకు అధికారులు పోటీలు పడేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులతో పాటు స్థానికంగా చోటామోటా నాయకుల పెత్తనం కూడా ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఇక్కడ పనిచేయటమంటే కోరి తలనొప్పి తెచ్చుకున్నట్టేనని అధికారులు భావిస్తున్నారు. కనీసం డెప్యుటేషన్‌పై రావడానికి కూడా ఎవరూ ఇష్టపడకపోవటం గమనార్హం.

- వీఎంసీకి అధికారులు కావలెను
- మేం వెళ్లమంటున్న అధికారులు
- డెప్యుటేషన్‌పై కూడా ఆసక్తి చూపని అధికారులు
- ప్రజారోగ్యం ఇంజినీరింగ్, జనరల్ అడ్మినిస్ట్రేషన్, జోనల్ కమిషనర్ల పోస్టులపై అధికారుల్లో నిరాసక్తి
- ఎమ్మెల్యేల పెత్తనం అధికంగా ఉండటమే కారణమా?



వీఎంసీ ప్రధాన కార్యాలయం

పటమట(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వివిధ విభాగాల అధికారుల స్థానంలో వచ్చేందుకు ప్రభుత్వ అధికారులెవ్వరూ ఆసక్తి చూపటం లేదు. గతానుభవాల దృష్ట్యా ఇక్కడ పనిచేయాలంటే రాజకీయ ఒత్తిళ్లు అధికంగా ఉంటాయని, ఎమ్మెల్యేలతో పాటు చోటామోటా నాయకుల పెత్తనం కూడా అధికంగా ఉంటుందని, ప్రతి అంశంలో రాజకీయ జోక్యం అధికంగా ఉంటుందనే కారణంతో ఆయా పోస్టుల్లోకి వచ్చేందుకు అధికారులెవరూ ఆసక్తి చూపటం లేదు. ఇటీవల వరదల అనంతరం చోటుచేసుకున్న పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అధికారిక కార్యక్రమం చేపట్టినా ఇక్కడి నుంచి ప్రారంభించటం, పని ఒత్తిడి అధికంగా ఉండటం, రాజకీయ నాయకుల నుంచి అందరి ముందు అవమానాలను ఎదుర్కోవటం తదితర కారణాలతో వీఎంసీ అంటేనే అధికారులు భయపడిపోతున్నారు. గతంలో ఆయా విభాగాల నుంచి డెప్యుటేషన్‌పై ఇక్కడికి వచ్చేందుకు పోటీలు పడేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా మారటంతో పూర్తిస్థాయిలో కాకపోయినా రెండు, మూడేళ్ల కాలపరిమితికి డెప్యుటేషన్‌పై కూడా వచ్చేందుకు అధికారులు ఆసక్తి చూపటం లేదు.

ప్రధాన విభాగాల్లో ఇన్‌చార్జిల పాలన

ఇప్పటికే వీఎంసీ ప్రధాన విభాగాలైన ప్రజారోగ్యం, పట్టణ సాధికార విభాగం, జనరల్ అడ్మినిస్ట్రేషన్, జోనల్ కమిషనర్ల పోస్టులు భర్తీ కాకపోవటంతో ఇన్‌చార్జి అధికారుల పాలన కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో భర్తీ చేయాల్సిన ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, శానిటేషన్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అధికారులు కూడా నగరంలో విధులు నిర్వహించేందుకు సుముఖత చూపటం లేదు. దీనికి తోడు పూర్తిస్థాయిలో అధికారుల నియామకం జరగకపోవటంతో ఇన్‌చార్జిలపై పని భారం పడుతోందని, ప్రజలకు మెరుగైన పాలన అందించలేకపోతున్నామని పలువురు అధికారులు వాపోతున్నారు. జనరల్ అడ్మినిస్ట్రేషన్‌ను పర్యవేక్షించే వీఎంసీ అడిషనల్ కమిషనర్(జనరల్) అధికారిగా ఓ అధికారిని 15 రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నియమించగా, ఇక్కడ విధుల్లో చేరి వెంటనే వెళ్లిపోయారు. స్థానికంగా ఉన్న రాజకీయ పరిస్థితుల కారణంగానే ఆయన ఇక్కడి నుంచి వెళ్లిపోయారని సిబ్బంది చెబుతున్నారు.

కూటమి నాయకుల షరతులకు తలొగ్గలేకేనా..

నగరానికి మౌలిక వసతులు కల్పించే ఇంజినీరింగ్ విభాగంలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల అవసరం ఉన్నప్పటికీ ఆ పోస్టుల్లో వచ్చేందుకు ఇంజినీర్లు ఎవరూ ఆసక్తి చూపటం లేదు. రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల కల్పనలో కూటమి నాయకులు చెప్పిన వారికే నామినేటెడ్‌లో కాంట్రాక్టులు ఇవ్వాలనే షరతు విధించటం, బిల్లుల చెల్లింపులు కూడా కొర్రీలు లేకుండా వేయాలని, పనుల పర్యవేక్షణ కూడా తమకు సమాచారం ఇవ్వాలని ప్రభుత్వంలోని పెద్దలు షరతులు విధించటంతో ఈ విభాగానికి వచ్చేందుకు ఇంజినీర్లు ఆసక్తి చూపటం లేదు. దీనికి తోడు గతంలో అమృత్ పథకంలో వీఎంసీకి స్టామ్‌వాటర్ డ్రైన్‌లు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు రూ.440 కోట్లలో అధికంగా అమరావతి ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మళ్లింపు జరగ్గా అలాంటి వ్యవహారాలు మళ్లీ కొనసాగుతాయని, తర్వాత తాము ఇబ్బందులు పడతామని వీఎంసీ ఇంజినీరింగ్‌కు ఈఈ స్థాయి అధికారులెవరూ ముందుకు రావటంలేదు. నగరాన్ని నిత్యం శుభ్రంగా ఉంచే ప్రజారోగ్య విభాగానికి ఉన్నతాధికారి లేరు. ఇక్కడకు వచ్చే ముందు అధికారులు స్థానిక పరిస్థితులను వాకబు చేయటంతో వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపటం లేదు.

సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది అందరూ సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం సిబ్బందికి సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. వీఎంసీలోని అన్ని శాఖల్లోని గుమస్తాలు, సూపరింటెండెంట్లకు, ఈఆర్‌పీ (ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్)లో కౌన్సిల్ నిర్వహణలో వాయిస్ లోని సాంకేతిక నిపుణులతో శిక్షణ ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం పెంచేందుకు కౌన్సిల్ ప్రియంబుల్‌ను, ఈఆర్‌పీ ద్వారా ఎలా నిర్వహించాలి అన్న అంశంపై శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో గుమస్తాలు, సూపరింటెండెంట్లు వారికి వచ్చిన సందేహాలను నిపుణులను అడిగి తెలుసుకున్నారు.

యువతి అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువతి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. లేబర్ కాలనీకి చెందిన యువతి డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకుని ఆర్నెల్లుగా ఇంటి వద్దే ఉంటుంది. బుధవారం ఉదయం భవానీపురంలో ఇంటర్వ్యూ ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. మధ్యాహ్న సమయంలో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. ఇంటర్వ్యూలో ఉందేమోనని భావించి తిరిగి సాయంత్రం ఆరు గంటలకు ఫోన్ చేయగా ఫోన్ పనిచేయలేదు. దీంతో యువతి తల్లి లక్ష్మి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సంగీత ఉత్సవాలకు సిద్ధం

- ఈ నెల 24 నుంచి ప్రారంభం
- డిసెంబరు 1 వరకు నిర్వహణ
- పలు ప్రాంతాల నుంచి రానున్న సంగీత విద్వాంసులు



సద్గురు సంగీత సభలో విఖ్యాత వయోలిన్ విద్వాంసులు కన్యాకుమారి (ఫైల్)

విజయవాడ కల్చరల్: విజయవాడ నగరం సంగీత, సాహిత్యాలు, సంప్రదాయ నృత్యాలకు నిలయం. కాలానుగుణమైన మార్పులతో నగరం రూపురేఖలు మారుతున్నా సంప్రదాయవాదులు తమ ఉనికిని కాపాడుకుంటూనే ఉన్నారు. ఏటా పలు సంగీత సంస్థలు సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు, పారుపల్లి రామ కృష్ణయ్య పంతులు, సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి సంస్కరణోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నాయి. వాటిలో శ్రీ సద్గురు సంగీత సభ ప్రధానమైనది. త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలతో 34 సంవత్సరాలుగా వార్షిక సంగీత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

కార్యక్రమాలు ఇలా....

ఈ నెల 24 వ తేదీ గాంధీనగర్‌లోని విద్యాభారతి శ్రవణ సదనంలో ప్రారంభమై డిసెంబరు 1 వ తేదీ సాయంత్రం వరకు ఉత్సవాలు జరుగుతాయి. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఉంటాయి. తొలిరోజు లతాంగి సోదరీమణుల గాత్ర యుగళం, 25న మల్లాది సోదరులు, 26 న డాక్టర్ ముప్పవరపు సింహాచల శాస్త్రికి హరికథా చతురానన బిరుదు ప్రదానం, డాక్టర్ వాగీష్ గాత్ర కచేరీ, 27న విఘ్నేష్ ఈశ్వర్ గాత్రం, 28 న హేరంబ్, హేమంత్ వేణువు, 29న పోపూరి గౌరీనాథ్, 30న ఐశ్వర్యా విద్యా రఘునాథ్ గాత్ర కచేరీ, డిసెంబరు 1వ తేదీ హిందుస్థానీ వాద్య సంగీత సభ నిర్వహిస్తారు.

సంగీతానికి ఎల్లలు లేవు



సంగీతానికి ఎల్లలు లేవు. సంగీత సభలో పాల్గొనటానికి వివిధ ప్రాంతాల నుంచి విద్వాంసులు వస్తారు. కర్ణాటక సంగీతంతో పాటు, హిందుస్థానీ కార్యక్రమాలు నిర్వహిస్తాం. సంగీత, సాహిత్య, నృత్య సంబంధమైన హరికథకు కూడా ప్రాధాన్యం ఇస్తాం. కార్యక్రమ నిర్వహణకు తొమ్మిది మందితో కూడిన కమిటీ ఉంది. సంగీత అభిమానులను కార్యక్రమానికి రప్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. **–పోపూరి గౌరీనాథ్, సద్గురు సంగీత సభ కార్యదర్శి**

మూడు దశాబ్దాలుగా సంగీత సేవలో



34 సంవత్సరాలుగా విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సంగీత అభిమానుల అభిరుచి మేరకు కార్యక్రమాలను తయారు చేశాం. సమయపాలనే ప్రధానంగా సంగీత కచేరీలు సాగుతాయి. వర్ధమాన యువతకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాం.

– బీవీఎస్ ప్రకాష్, అధ్యక్షుడు, సద్గురు సంగీత సభ

ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలి

సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న కాశీనాథ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. శ్రీశ్రీ భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు. వరదల్లో నష్టపోయిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి నష్టపరిహారం అందజేయాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ విధానాలు మార్చుకోవాలని అన్నారు. ఆటో కార్మికులపై ఫైనాన్స్ కంపెనీల వేధింపులు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల నగరంలో వచ్చిన వరదల్లో సర్వం కోల్పోయిన కార్మికులు ఆటోల కిస్తీలు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీంతో ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని మూడు నెలల పాటు మారటోరియం ప్రకటించాలని కోరారు. బుడమేరు ముంపునకు గురైన ఆటోలకు రూ. 25వేలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. దుర్గారావు, యూనియన్ నగర నాయకులు బి.రూబేన్ కుమార్, ఎం. హనుమంతరావు, రాఘవ, డి.కాశేశ్వరరావు, రామకృష్ణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పృథ్వీ టయోటా షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న సత్యనారాయణ, అంజమ్మ దంపతులు, చిత్రంలో చైర్మన్ రమేష్ బాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి బైపాస్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పృథ్వీ టయోటా షోరూమ్‌ను సంస్థ చైర్మన్ ఎం.రమేష్‌బాబు తల్లిదండ్రులు మాలెంపాటి సత్యనారాయణ– అంజమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం చైర్మన్ మాలెంపాటి రమేష్ బాబు మాట్లాడుతూ రాజమండ్రి, కాకినాడలో ఉన్న పృథ్వీ టయోటా షోరూంను ఇప్పుడు విజయవాడలో నూతనంగా ప్రారంభించామని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ ఎం.పృథ్వీ మాట్లాడుతూ నూతన షోరూం ప్రారంభం సందర్భంగా 100 శాతం ఫైనాన్స్ సౌకర్యంతో కస్టమర్లకు సరికొత్త మోడల్స్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో షోరూం సీఈఓ పి.కిరణ్ కుమార్, జనరల్ మేనేజర్ భాను శ్రీనివాస్, విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని), పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ఇన్నర్‌వీల్ క్లబ్ కృషి



శిక్షణ తీసుకుంటున్న మహిళలతో ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రముఖులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళా సాధికారత కోసం ఇన్నర్‌వీల్ క్లబ్ విశేష కృషి చేస్తుందని ఆ సంస్థ అధ్యక్షురాలు సునీతజైన్ అన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ సన్‌షైన్ సహకారంతో కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమెన్ స్టడీస్ సెంటర్ విభాగంలో ఏర్పాటుచేసిన బోటిక్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుట్టు పనుల వంటి చేతి వృత్తుల ద్వారా మహిళలు ఇంటి నుంచి పనిచేస్తూనే చక్కటి ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. తమలోని నైపుణ్యాలను మరింత పెంచుకోవడం, కాలానికి అనుగుణంగా ప్రజల్లో మారుతున్న ఇష్టాలను తెలుసుకుంటూ వస్త్రాలు డిజైన్ చెయ్యగలిగితే మంచి సంపాదన పొందడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం శిక్షణ తీసుకుంటున్న మహిళలకు కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాస్ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూహైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు, ఉమెన్ స్టడీస్ సెంటర్ కన్వీనర్ వి.శైలజ, ఇన్నర్‌వీల్ క్లబ్ విజయవాడ అధ్యక్షురాలు కరంబీర్ కౌర్ పాల్గొన్నారు.

విద్యా సేవకులు శ్రీనివాసు, సుధీర్

సెంట్రల్ అమెరికా యూనివర్సిటీ నుంచి కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ నుంచి పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి చిట్టా అమర సుధీర్ గౌరవ డాక్టరేట్లు అందుకున్న సందర్భంగా గురువారం సాయంత్రం కేబీఎన్ కళాశాలలో సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా హిందూహైస్కూల్స్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీ శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య మాట్లాడుతూ శ్రీనివాసు, సుధీర్‌ల ముందుచూపు చాలా ఉన్నత స్థాయిలో ఉంటదన్నారు. వారు ప్రవేశపెట్టిన సంస్కరణ వల్లే కేబీఎన్, పొట్టి శ్రీరాములు కళాశాలలు రాష్ట్రంలోనే ఉత్తమ స్థాయిలో ఉన్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో హిందూహైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ నారాయణరావు, కేబీఎన్ అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి ప్రసంగించారు. అనంతరం తూనికుంట్ల శ్రీనివాసు, అమర్ సుధీర్‌లను హిందూ హైస్కూల్స్ కమిటీ పక్షాన ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు ఉపాధ్యాయులకు సూచించారు. పాతబస్తీలోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌ను గురువారం డీఈవో సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి బోధనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులందరూ స్వీకరించే విధంగా చూడాలన్నారు. భోజనం నిబంధనలకు అనుగుణంగా తయారు చేసే దిశగా చూడాలని, ప్రతి రోజూ పర్యవేక్షించాలని సూచించారు. బోధనపై ఇచ్చిన శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు మంచి బోధనను అందించాలని కోరారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో సుబ్బారావు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడికి చెందిన శ్రీ అభినయ నాట్య అకాడమీ చిన్నారులు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కె.వి.జ్యోతి పర్యవేక్షణలో శిష్యబృందమైన ఎం.హిమబిందు, బి.దీపిక, ఎం.నాగదుర్గ, ఎస్.స్నేహశ్రీ , ఎం.వాగ్మశ్రీ, డి.ధనలక్ష్మి, డి.హేమశ్రీలతో పాటు పలువురు అమ్మవారి కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మహామండపంకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. పలువురు భక్తులతో చిన్నారులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు ముందుకు వచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు. జ్యోతితో పాటు నృత్య ప్రదర్శనలో పాల్గొన్న 20 మంది చిన్నారులను అభినందిస్తూ ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

కృష్ణానది నుంచి నేరుగా తాగునీరు సరఫరా చేయాలి

సీపీఐ డిమాండ్



టేనర్‌పేట అడ్డరోడ్‌లో స్థానికులతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ సర్కిల్–1 కార్యాలయం 47వ డివిజన్ పరిధిలోగల టేనర్‌పేట బూస్టర్‌కు గతంలో మాదిరిగానే కృష్ణానది నుంచి నేరుగా తాగునీటిని సరఫరా చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ నాయకుడు, మాజీ కార్పొరేటర్ డీవీ రమణ బాబు, సీపీఐ నగర నాయకులు ఆర్.యాకోబ్, కె.వెంకటేశ్వరరావు, బెనర్జీ, స్థానికులు గురువారం టేనర్‌పేటలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంత కాలంగా టేనర్‌పేట కొండ ఎగువ, దిగువ ప్రాంతాల్లో రోజుకు కేవలం పావుగంట కూడా తాగునీరు సరఫరా లేనందున 47,46 డివిజన్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో టేనర్‌పేట బూస్టర్ వెనుక బోరింగ్ పైపులు ఏర్పాటు చేసి వాటికి బూస్టర్ మోటార్‌కు కనెక్షన్ ఇచ్చి బోరింగ్ పంపుల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు వాటర్ సప్లై అధికారులు యత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న స్థానికులకు మద్దతుగా తాము నిరసన తెలుపుతున్నామని సీపీఐ నాయకులు వివరించారు. బోర్ వాటర్ కేవలం వాడకానికి మాత్రమే ఉపయోగపడతాయి తప్ప తాగేందుకు పనికిరావని అన్నారు. కృష్ణానది చెంతనే ఉండి కూడా తాగునీటి కోసం రోడ్డెక్కాల్సి రావడం బాధాకరమన్నారు. ప్రజలకు తాగునీరు సక్రమంగా అందించలేక పోవడానికి అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యమే కారణమని మండిపడ్డారు. ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్‌పై ఉందని, కమిషనర్ వెంటనే స్పందించి తాగునీటిని సక్రమంగా అందించాలని విజ్ఞప్తి చేశారు.